129

# అందరికీ వేడి (తే)నీరు

**"నా** పేరు జహంగీర్" అన్నాడతను కెటిల్‌లోంచి ఆవిరులు కక్కుతున్న 'టీ'ని కప్పుల్లో పోస్తూ, కానీ అతని తండ్రి పేరు అక్బర్‌కాదు.

షరాఫ్‌సాబ్‌కు ఆరుగురు కొడుకులూ, ఐదుగురు కూతుళ్ళూ, వెరసి పదకొండుమంది సంతానం.

"నేను మూడోవాణ్నండీ! పెద్దవాళ్ళిద్దరూ ఊళ్ళో వ్యవసాయం చేసుకుంటున్నారు. నాకన్నా చిన్నవాళ్ళు అక్కడక్కడా చిల్లరమల్లర పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. చిల్లరమల్లరంటే - ఒకడేమో ఉస్మాన్‌గంజ్‌లో బస్తాలు మోస్తున్నాడు, రెండోవాడు పెట్రోలు బంకు దగ్గర పనిచేస్తున్నాడు. ఆఖరువాడు టైలరింగ్ నేర్చుకొంటున్నాడు"అన్నాడు జహంగీర్.

నలుగురూ ఒకే ఊళ్ళో వున్నా ఒకే ఇంట్లో మాత్రం ఉండడం లేదు. అలా ఉండడం సాధ్యంకూడా కాదు. ఎంచేతనంటే, జహంగీర్, జూలాజికల్ పార్కుకు అవతలగా ఉంటున్నాడు. అతని భార్య అక్కడే ఉన్న ఓ పిండిమరలో కూలిపని చేసుకుంటున్నది. ముడుచుకోవడానికి తప్ప బారచాపడానిక్కూడా చాలనంత చిన్న పాకలో అతనిప్పుడుంటున్నాడు. పైగా ఇద్దరు చంటిపిల్లలు కూడా. అందర్నీ వొకేచోట ఉంచుకోవడం- ఛస్తే కుదిరేపనికాదు. ఈ మాటే జహంగీర్ కూడా అన్నాడు.

"నాకు చదువురాదు. రాదంటే చదువుకోలేదు. అసలు మా వూళ్ళో ఆ రోజుల్లో బడేలేదు. మా నాన్నతో పాటు పొలంపని చేసేవాణ్ని. అప్పుడెప్పుడో సీతాఫలాల లారీ మీద మా నాన్నతో పాటు హైదరాబాదు వొచ్చా, హొటల్లో తిన్నా సినిమా చూశా. ఇక్కడే ఉందామనుకొన్నా. ఇక్కడికి వొచ్చేశా" అన్నాడు జహంగీర్.

తన కథ కొస్తూ జహంగీర్ నీరసంగా నవ్వాడు-

"చాలా పనులు చేశానండి! ఆఖరికి ఇందులో కుదురుకొన్నాను. మరో ఉద్యోగానికి వెళ్లను భగవంతుడి దయవల్ల, మూడు నాలుగు ఆఫీసుల్లో మంచి మంచి ఖాతాలున్నాయి. ఏదోకాలం గడిచిపోతున్నది" అన్నాడు జహంగీర్.

మొదట అతనో ఇరానీ హొటల్లో పనిక్కుదిరాడు. ఆ అనుభవాలను చెబుతున్నప్పుడు అతని ముఖం గండరించిపోయింది.

"రోజుకు 'ఇన్ని గంటలు' అన్నదేమీ లేదండీ! కాయితాలమీద ఉంటాయేమో నాకు తెలియదు. 'చాయ్'లు ఇవ్వడం, అప్పుడప్పుడు తాగిన కప్పుల్ని నీళ్ళగ్లాసుల్నీ తీయడం, మరొకడు వొచ్చిందాకా పనిచేయడం, ఏ కారణంచేతనన్నా వారు రాకపోతే, అతగాడి డ్యూటీ కూడా చేయవలసి రావడం, బూతులు, అప్పుడప్పుడు దెబ్బలు - ఇదీ తంతు. ఇవన్నీ భరిస్తూ మూడుసంవత్సరాలు పనిచేశానండీ. అయితే ఈ మూడేళ్ళూ వొక్కచోటనే పని చేయలేదు. చాలా చోట్ల మారాను. కాస్త కుడి ఎడంగా అన్ని హొటళ్ళలోనూ, వొక రకంగా తగలడ్డాయి పరిస్థితులు" అన్నాడు జహంగీర్. ఈ హొటళ్ళలో పనిచేసే వారి జీత భత్యాలు వో రకంగా ఉండవన్నాడు జహంగీర్. రెండు పూటలా భోజనం, రెండుసార్లు టీ ఇచ్చి నెలకు ముప్పయ్యో, నలభయ్యో ఇవ్వడం వొక పద్ధతి. కమీషన్ పద్ధతి మీద పనిచేయడం ఇంకో పద్ధతి. ఈ కమీషన్ పద్ధతిలోనూ, మళ్ళీ చాలా రకాలున్నాయిట.

“ఇది కూడా హోటల్‌ను బట్టి మారుతూ ఉంటుందండి! ఓ మాదిరి అమ్మకాలు హోటల్, ఒక్కోచాయ్‌కు ఐదు పైసలు ఇస్తుంది. ఇంతకన్నా అమ్మకాలు బాగా జరిగే సెంటర్లలో ఉన్నహోటల్ వారు ఒక్కో చాయ్‌కు రెండు మూడు పైసలిస్తారు. ఎప్పుడూ జనంతో కిటకిటలాడే చోట రూపాయికి పది పైసల్నిమించి ఇవ్వరు. ఈ పది పైసలూ చాయ్‌మీదనే కాదండి కేకులు, బన్నులు, బిస్కెట్లు అన్నింటి మీద కలిపి ఉంటుంది” అన్నారు జహంగీర్. కొన్ని కొన్ని చోట్ల, హోటల్లోపల జరిగే అమ్మకాలమీద కూడా కమిషన్ ఉంటుందనీ, ఇది ఇంకో పద్ధతి అని అతను చెప్పాడు. అన్ని సరుకులకు ధర నిర్ణయమై ఉంటాయి. సప్లయర్ ముందుగానే టోకెన్లు కొనుక్కుంటాడు. ఈ కొనేటప్పుడే డిస్కౌంటు ఉంటుంది. సరుకును తీసికెళ్ళే ప్రతిసారీ, దాని ఖరీదుకు సరిపడినన్ని టోకెన్లు మేనేజరుకివ్వాలి. అమ్ముడు కాని సరుకును లోపలికి తీసుకెళ్ళేప్పుడు తిరిగి మేనేజరుకు చూపించి, రిటర్న్ చేసిన సరుకు విలువలకు సరిపడా టోకెన్లు తీసుకుంటారు. ఇందువల్ల మోసం జరగడానికి అవకాశం ఉండదు.

అయితే జహంగీర్ చేస్తున్నది ఇటువంటి పనిమాత్రం కాదు, అతను హోటల్లోపల సప్లయి చేయడు. ముందుగానే టోకెన్లు కొనుక్కుంటాడు. వాటితో కష్టమర్లు అడిగిన సరుకును కొని పట్టుకెళ్ళి, వారికి అందజేస్తాడు.

“ఇక్కడ బాగా అమ్మకాలు జరుగుతాయండీ! మంచి సెంటరు. రూపాయికి పదిపైసల కమిషన్ దొరుకుతుంది. రొట్టెలు, బిస్కెట్లు, బన్ మస్కా, సమోసాలు, వీటన్నింటిమీద ఇదే కమిషన్ ఉంటుంది. ‘చాయ్’ ఇంకాస్త లాభమెక్కువ. ఎనిమిది చాయ్‌లు తీసుకెళ్ళి పది కప్పుల్లోనో, తొమ్మిది కప్పుల్లోనో సర్దేశాననుకోండి. ఆ డబ్బు నాకు అదనంగా వొచ్చినట్టేగదా! కమిషన్ రాదుగానీ, నా ఖాతాదార్లకు సిగరెట్లు పాన్‌లు కూడా నేను అందిస్తుంటాను. అందుకనే నా దగ్గరకు ఎక్కువమంది వొస్తుంటారు. రోజుకు అయిదు, ఆరు, ఒక్కోసారి ఎనిమిది రూపాయల దాకా కమిషన్ దొరుకుతుంది. ‘ఇంతే’ అని ఖచ్చితంగా చెప్పలేమండీ! గిరాకీని బట్టి వుంటుంది.” అన్నాడతను.

ఒక్కోసారి రెండు రూపాయలు కూడా ఉండకపోవచ్చునన్నాడు. తన సాదరుకు ఓ రూపాయికి మించకుండా తన దగ్గరుంచుకొని, మిగిలిన డబ్బంతా పక్కనే ఉన్న కిళ్ళీ దుకాణంలో దాచిపెట్టుకుంటానని, నెలాఖరున లెక్క చూసి తన డబ్బు తీసుకుంటానని ఈ నెల రోజుల పాటు తన డబ్బును వాడుకొన్నందుగ్గాను, నూటికి ఒక రూపాయి చొప్పున పాన్‌వాలా ‘మిత్తి’ ఇస్తాడని అతనన్నాడు.

జహంగీరు ఉన్న చోట నీళ్ళకు చచ్చిన చావుగా ఉంటుందిట ఒక్కటే ‘పబ్లిక్ నల్లా’ ఉందిట. అక్కడైనా కాసేపుకన్నా నీళ్ళు రావట. ఎన్నోసార్లు ‘దొర’లకు చెప్పుకున్నా లాభం లేకపోయిందిట.

“మీరెప్పుడన్నా రండి చూద్దురుగాని జుట్లు జుట్లు పట్టుకొని ఛస్తున్నాం. ఎవరూ వినిపించుకోరు... సరేలెండి. మాకు ఇది అలవాటయిపోయింది.”

తాగుతున్న బీడీని ఆర్పి, సంచిలో వేసుకుని చువ్వలాగా నిలబడ్డాడు జహంగీర్. అతనలా లేచినప్పుడు మెటికలు విరుచుకున్నట్లు నరాలు కిటమటమన్నాయి.